సాక్షి
వైఎస్సార్ జిల్లా
గురువారం । 25 । జూలై । 2024



పోషకాహారం.. వ్యాధులు దూరం
అసలే వర్షాకాలం.. అంటు వ్యాధుల చుట్టుముట్టే కాలం. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా.. మలేరియా, డయేరియా వ్యాధులు వెంటాడతాయి. -8లో



ఎర్రచందనం దుంగలు స్వాధీనం
అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం దుంగలను అటవీ సిబ్బంది బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేశారు. -8లో

గరిష్టం/కనిష్టం
34.5/27.2

వాతావరణం
జిల్లాలో బుధవారం 27.2 – 34.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 10.26 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

జేసీగా 'అదితి' బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితి సింగ్

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగుల సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ తెలిపారు. బుధవారం ఉదయం జాయింట్ కలెక్టర్‌గా ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 2020 బ్యాచ్‌కు చెందిన తాను తొలుత విశాఖపట్టణంలో శిక్షణ తీసుకున్నానని, ఆ తర్వాత విజయవాడ సబ్ కలెక్టర్‌గా పనిచేశానన్నారు. తిరుపతి మున్సిపల్ కమిషనర్ ఆరు నెలలు పనిచేసి ఇక్కడికి బదిలీపై వచ్చానని తెలిపారు. అంతకుముందు ఆమె కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి వెళ్లి కలెక్టర్ శివశంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

29 నుంచి పసుపు కొనుగోలు నిలిపేస్తాం

కడప అగ్రికల్చర్: కడప మార్కెట్‌యార్డులో గత కొన్ని నెలల నుంచి కొనసాగుతున్న శీతల గిడ్డంగి నిర్మాణ సమస్యను పరిష్కరించకుంటే ఈ నెల 29 నుంచి పసుపు కొనుగోళ్లను నిలిపివేస్తామని టర్మరిక్ మర్చెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ విషయమై బుధవారం కడప మార్కెటింగ్ శాఖ జేడీకి వినతిపత్రమిచ్చారు.

రిమ్స్‌లో 'నిఫా వైరస్' ప్రత్యేక వార్డు



'నిఫా వైరస్' బాధితుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డును ప్రారంభించిన డాక్టర్ల బృందం

కడప అర్బన్: కడప ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఐపీ విభాగంలో 'నిఫా వైరస్' బాధితుల కోసం 10 పడకల ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశారు. బుధవారం ఈ వార్డును ప్రారంభించారు. ఎవరైనా 'నిఫా వైరస్' తో బాధపడుతూ వస్తే వారికి ప్రత్యేకంగా చికిత్స చేసేందుకు ఈ వార్డును ఉపయోగించుకోవచ్చని రిమ్స్ ఆర్ఎంఓ వై. శ్రీనివాసులు తెలియజేశారు. ఈ వైరస్‌తో బాధపడేవారికి మైక్రోబయాలజీ, జనరల్ మెడిసిన్, పల్మనాలజీ, అనస్థీషియా విభాగాలకు సంబంధించిన వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండి, వైద్య సేవలను అందిస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ హెచ్ఓడీ యాదవేంద్రారెడ్డి, వైద్యులు అర్జున్‌కుమార్, నూకరాజు, సీఎస్ఆర్ఎంఓలు గీత, సునీత, అనస్తీషియా హెచ్ఓడీ డాక్టర్ సునీల్ చిరువెళ్ల తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి భవనాలు వెంటనే పూర్తి చేయాలి



బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న డీఈఓ

ఖాజీపేట: బాలుర ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణం వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ పాఠశాల హెచ్ఎం శివశంకర్‌కు సూచించారు. ఖాజీపేటలోని బాలుర ఉన్నత పాఠశాల, అంగన్ వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల (మెయిన్ స్కూల్)ను తనిఖీ చేశారు. బాలుర ఉన్నత పాఠశాలలో నిర్మాణంలో ఉన్న భవనాలు చూశారు. భవనాలు అసంపూర్తిగా ఉండడాన్ని గమనించి.. వెంటనే పనులు పూర్తి చేయించాలని సూచించారు. పాఠశాల నిర్వహణ సక్రమంగా లేక పోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం వంటలను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు అందే భోజనంలో క్వాలిటీ ఉండాలని సూచించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థులకు అందే భోజనం స్వయంగా రుచి చూశారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించి.. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

తవ్వుకో.. అమ్ముకో!

టీడీపీ నేతలు బరి తెగిస్తున్నారు. అధికారం అండతో ప్రకృతి వనరులను ధ్వంసం చేస్తున్నారు. ముఖ్యంగా ఇసుకలో అక్రమార్జనే ధ్యేయంగా నదీమ తల్లులను చెరబడుతున్నారు. అనుమతులు లేకున్నా.. నిబంధనలు నదిలో తొక్కి మరీ ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు. కళ్లెదుటే ప్రకృతి సంపద హరించుకుపోతున్నా.. అడ్డుకోవాల్సిన అధికారులు గట్టున నిలబడి కళ్లప్పగించి చూస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

- ప్రొద్దుటూరులో రెచ్చిపోతున్న ఇసుకాసురులు
- యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు



ఇసుకను తరలిస్తున్న టిప్పర్లు



కామనూరు వద్ద కుందూ నదిలో జేసీబీతో అక్రమంగా ఇసుకను తవ్వుతున్న దృశ్యం (ఇన్‌సెట్) ఇసుక రవాణా చేస్తూ ట్రాక్టర్ బోల్తాపడి మృతి చెందిన యువకుడు ప్రతాప్ (ఫైల్)

ప్రొద్దుటూరు: అధికార పార్టీ నేతలు చెలరేగిపోతున్నారు. అధికారాన్ని అండగా చేసుకుని అక్రమ ఇసుక దందాకు తెరలేపారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఇసుకాసురుల అక్రమాలకు హద్దే లేకుండా పోయింది. 'పార్టీ మాదే.. ప్రభుత్వం మాదే.. మా ఊరి పక్కన ఉన్న ఇసుక క్వారీలపై అధికారం కూడా మాదే' అంటూ డప్పు కొట్టి మరీ బహిరంగంగా ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారు. ఎన్నికల ఫలితాలు రావడమే ఆలస్యం ఇసుక క్వారీలపై పెత్తనం మొదలుపెట్టారు. పగలు, రాత్రి తేడా లేకుండా జేసీబీలు ఏర్పాటు చేసి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తూ లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారు. అధికార పార్టీ నేతల దౌర్జన్యాన్ని చూసి పోలీసులు కూడా ప్రశ్నించలేని పరిస్థితి నెలకొంది. ప్రొద్దుటూరు పరిధిలోని రామేశ్వరం, చౌడూరు, రామాపురం, కల్లూరు, నంగనూరుపల్లె, ఎర్రగుంట్ల మండలంలోని పోట్లదుర్తి ప్రాంతాల నుంచి నిత్యం ఇసుక రవాణా జరుగుతోంది. వాస్తవానికి ఇటీవల ప్రభుత్వం ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసినా.. ఇక్కడ మాత్రం వీరి దందా కొనసాగుతూనే ఉంది. అధికారికంగా ఇసుక క్వారీ లేకున్నా అనధికారికంగా వీరు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు.

ఇసుక డిమాండ్..నాయకులకు వరం

వాస్తవానికి ప్రొద్దుటూరు వ్యాపార కేంద్రం. నిత్యం ఇక్కడ కట్టడాల నిర్మాణం జరుగుతుండటంతో ఇసుకకు పెద్ద డిమాండ్ ఉంది. పట్టణ పరిధిలో పెన్నానది పరివాహక ప్రాంతం ఉంది. కిలో మీటర్ల పరిధిలో నదీ ప్రాంతం ఉన్నా అధికారుల దృష్టిలో మాత్రం ఇక్కడ ఇసుక నిల్వలు లేవు. అనధికారికంగా మాత్రం ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. అధికారికంగా ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేస్తే ఆ డబ్బు ప్రభుత్వానికి జమ అవుతుంది.

ఇసుక అక్రమ రవాణాకు యువకుడు బలి

ఇసుక అక్రమ రవాణా దందాలో ఇటీవల ఓ యువకుడు బలయ్యాడు. ఎస్ఈబీ అధికారులు వస్తున్నారన్న సమాచారంతో ఇసుక రవాణా చేస్తున్న కమటం ప్రతాప్ అనే యువకుడు ట్రాక్టర్ అదుపు తప్పి మృతి చెందాడు. ఆ ట్రాక్టర్ చౌటపల్లెకు చెందిన అధికార పార్టీ నేతలది కావడం గమనార్హం.

ఎమ్మెల్యే వరద స్వగ్రామంలో అనధికారిక వేలం!

ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి స్వగ్రామమైన కామనూరు పరిధిలోని కుందూ నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఇక్కడ గలుగు ఇసుక ఉండటంతో ప్రభుత్వం ఏరోజూ ఇక్కడ ఇసుక వేలం పాట నిర్వహించలేదు. కానీ ఈ ఇంటి నిర్మాణాలు, పంట పొలాలకు, ఇతర అవసరాలకు నిత్యం ఈ ఇసుకను తరలిస్తున్నారు. దీని కోసం రూ.25 లక్షలతో గ్రామంలో అనధికారంగా వేలం నిర్వహించినట్లు సమాచారం. జేసీబీతో ఇసుక తవ్వకాలు జరుపుతూ ట్రాక్టర్‌కు, టిప్పర్లకు గేట్ వసూలు చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఇసుక అక్రమ తవ్వకాలు వైరల్ కావడంతో డీఎస్పీ మురళీధర్ మంగళవారం నిలిపేశారు. ఇక పాపాఘ్ని నదీ తీర ప్రాంతంలో కూడా అక్రమ ఇసుక తవ్వకాలను అరికట్టలేని పరిస్థితి ఏర్పడింది. ఏ ఊరి పరిధిలో క్వారీ ఉంటే వారిదే అక్కడ పెత్తనంగా మారింది.

ఎమ్మెల్యే తీరే వేరు... ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తీరే వేరు. మాటకు ముందు అవినీతిని సహించనని బీరాలు పలుకుతారు.. అంతటితో ఆగరు.. అధికారుల దగ్గరికెళ్లి ఏకంగా దేవుళ్ల చిత్రపటాలపై ప్రమాణమూ చేయిస్తారు.మరి.. ఇంత చెప్పే ఆయన నీతిగా ఉంటారా అంటే అబ్బే... అస్సలు కాదు. తన స్వగ్రామమైన కామనూరు పరిధిలోని కుందూ నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నా చోద్యం చూస్తుండడమే ఇందుకు నిదర్శనం. ఎమ్మెల్యే వరద తీరు చూసిన జనం 'ఔరా' అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

పరిహారం అందించకుండానే పనులా!

- హైవే పనులను అడ్డుకున్న రైతులు



రోడ్డు పనులు జరుగుతున్న చోట నిరసన తెలుపుతున్న బాధిత రైతులు

మైదుకూరు: బళ్లారి – కృష్ణపట్నం నేషనల్ హైవే నిర్మాణం కోసం విలువైన భూములు కోల్పోయామని.. నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కుటుంబ సభ్యులతో కలసి స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులో జరుగుతున్న హైవే పనులను బుధవారం అడ్డుకుని నిరసన తెలిపారు. రైతులకు మద్దతుగా సీపీఐ అనుబంధ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు. సమాచారం అందుకున్న మైదుకూరు అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మస్తాన్, అర్బన్ ఎస్ఐ ఘణ మద్దిలేటి అక్కడికి చేరుకున్నారు. పనులను అడ్డుకొని నిరసన తెలియజేస్తున్న రైతులతో, రైతు సంఘం నాయకులతో మాట్లాడారు. సమస్యను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో రైతులు నిరసన విరమించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు బాధిత రైతుల సమస్యలను పరిష్కరించి వారికి నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిలుంగారి పెద్దపుల్లయ్య, కొమ్మినేని చెన్నయ్య, కంచం నారాయణ పాల్గొన్నారు.

భూ వివాదాల సమస్యలు స్వీకరణ

రాయచోటి: అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ డివిజన్‌కు సంబంధించిన భూ వివాదాల సమస్యలపై అందించిన వినతులను రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ) ఆర్‌పీ సిసోడియా గురువారం స్వీకరిస్తారని కలెక్టర్ చామకూరి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం సాయంత్రం 4 గంటల నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు.

అశ్వవాహనంపై చెన్నకేశవస్వామి


రాజంపేట: తాళ్లపాక బ్రహ్మోత్సవాలు గురువారం ముగియనున్నాయి. కాగా బుధవారం చెన్నకేశవస్వామి అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం చక్రస్నానం, ధ్వజావరోహణ కార్యక్రమాల ఉంటాయి. శుక్రవారం స్నపన తిరుమంజనం, పుష్పయాగం కార్యక్రమాలు జరగనున్నాయి. శ్రీ సిద్దేశ్వరస్వామికి పార్వేట ఉత్సవం నిర్వహించారు. గురువారం త్రిశూలస్నానం, ధ్వజావరోహణ కార్యక్రమాలు ఉంటాయి.శుక్రవారం స్వామి వారికి స్నపన తిరుమంజనం, పుష్పయాగం నిర్వహించనున్నారు.



అశ్వవాహనంపై కొలువుదీరిన శ్రీ చెన్నకేశవస్వామి

'మైలవరా'నికి నీరు నిలుపుదల

కొండాపురం: గండికోట జలాశయం నుంచి మైలవరం జలాశయానికి నీటి సరఫరాను బుధవారం నుంచి నిలిపేశామని జీఎన్ ఎస్ఎస్ డీఈ ఉమామహేశ్వర్లు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండికోట జలాశయంలో నీటి మట్టం కనిష్ట స్థాయికి చేరిందన్నారు. గండికోట నుంచి తాగునీటి అవసరాల కోసం మైలవరం జలాశయానికి నీటిని విడుదల చేస్తూ వచ్చామన్నారు. గండికోట జలాశయంలో ప్రస్తుతం 1.5 టీఎంసీలు మాత్రమే నీరుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.



మైలవరం జలాశయం

చేనేత రంగానికి చేయూతనిస్తాం

- కలెక్టర్ శివశంకర్
- మైలవరం టెక్స్‌టైల్ పార్కుపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో చేనేత వృత్తికి పూర్వవైభవం తీసుకురావడంతో పాటు ప్రపంచ మార్కెట్‌లో మన చేనేత ఉత్పత్తులకు మంచి గుర్తింపును తీసుకొచ్చేందుకు చర్యలు చేపడతామని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా చేనేత, జౌళి సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు నాగరాజరావు అధ్యక్షతన జిల్లాలోని మైలవరం మండలంలో టెక్స్ టైల్ పార్కు అభివృద్ధి పనుల పురోగతిపై కమిటీ సభ్యులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కుటుంబాల ఆర్థిక అభివృద్ధి కోసం చేనేత, జౌళి శాఖ ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నాయన్నారు.మగ్గాలనే నమ్ముకొని జీవనోపాధి పొందుతున్న జిల్లా చేనేత వృత్తిదారులను ఆదుకునేందుకు, చేనేత వృత్తిని ప్రోత్సహించడానికి దాదాపు 3000 మందికి ఉపాధి అవకాశాలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని మైలవరం మండల పరిధిలో టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేస్తోందన్నారు. 2005–06 ఆర్థిక సంవత్సరంలో 68.18 ఎకరాల్లో 118 ప్లాట్లతో ఈ పార్కును అభివృద్ధి చేసేందుకు నాంది పలికారని పేర్కొన్నారు. ఇందుకుగాను కేంద్ర ప్రభుత్వం రూ. 5.99 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం 1.39 కోట్లు కలిపి మొత్తం రూ.7.38 కోట్లను కేటాయించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు రూ. 3.85 కోట్లు నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని వెల్లడించారు. కాగా ల్యాండ్ డెవలప్మెంట్, రోడ్లు, భవనాల నిర్మాణం, క్లినిక్, క్యాంటీన్, పవర్, వాటర్ సప్లై తదితర అభివృద్ధి మౌలిక సదుపాయాల పనులకు రూ. 2.78 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. ఇప్పటికే ఏపీఈడబ్ల్యుఐడీసీ, ఆర్‌డబ్ల్యుఎస్, ఏపీఎస్పీడిసిఎల్ శాఖల ద్వారా సివిల్ వర్క్స్, వాటర్, పవర్ సప్లై పునరుద్ధరణ పనుల కోసం రూ. 1.14 కోట్లు వినియోగించేందుకు రాష్ట్ర చేనేత జౌళి శాఖ పరిపాలనా అనుమతులిచ్చిందన్నారు. ఈ టెక్స్‌టైల్ పార్కులో యూనిట్ల స్థాపన కోసం ఇప్పటికే 47 మంది దరఖాస్తు చేసుకొని ప్లాట్లు సొంతం చేసుకోగా ఇంకా 75 ప్లాట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ రకాలుగా కార్మికులకు రాయితీలు ఇస్తోందని.. వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ పరంగా పూర్తి సహకారం అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్ఎం ఏపీఐఐసీ, ఏపీఎస్పీడీసీఎల్, ఆర్‌డబ్ల్యుఎస్, ఇంజనీరింగ్‌తోపాటు సంబందిత శాఖల అధికారులు, జిల్లా చేనేత జౌళి శాఖ అధికారులు, చేనేత యూనిట్లు పెట్టి ఎంటర్ ప్రెన్యూర్‌లు తదితరులు పాల్గొన్నారు.

పంట రుణానికి మోకౌలు అడ్డు!

దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించని చందంగా మారింది కౌలు రైతుల పరిస్థితి. ఈసారి తొలకరి ముందే పలకరించగా.. ఆశగా నాగలి పట్టిన రైతన్నకు కూటమి ప్రభుత్వంలో అడుగడుగునా అడ్డంకులే ఎదురవుతున్నాయి. అసలే అన్నదాత సుఖీభవ నిధులు అందలేదు.. ఆపై బ్యాంకు రుణం తీసుకుందామంటే కౌలు కార్డులూ రాలేదు. ఫలితంగా ఇటు సాయమందక.. అటు అప్పు పుట్టక కౌలు రైతులు దిగాలు పడుతున్నారు.

- సగం మంది రైతులకు అందని కౌలు కార్డులు
- ఖరీఫ్ ప్రారంభమై రెండు నెలల కావొస్తున్నా 50 శాతం పంపిణీ కాని వైనం
- బ్యాంకు రుణాల కోసం రైతుల ఎదురు చూపు



దువ్వూరు ప్రాంతంలో పసుపును సాగు చేస్తున్న కూలీలు

జిల్లాలో గత ఏడాది మంజూరైన కౌలు కార్డులు: **7035**
గతేడాది పంపిణీ చేసిన కార్డుల సంఖ్య: **8126**
ఈ ఏడాది కార్డుల లక్ష్యం: **10,000**
ఇప్పటివరకు పంపిణీ చేసిన కార్డులు: **4945**



కడప అగ్రికల్చర్: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలన్నర దాటింది. పంటల సాగును రైతన్నలు ముమ్మరంగా చేస్తున్నారు. ముఖ్యంగా భూమిలేని రైతులు కౌలుకు భూములు తీసుకుని పంటలను సాగు చేసుకుంటారు. వారు పంటల సాగుకు చేసుకునేందుకు బ్యాంకులు రుణాలు ఇవ్వాలంటే కౌలు రైతు గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉండాలి. ఈ కార్డుల జారీ ప్రక్రియ కొత్త ప్రభుత్వంలో నత్తనడకన సాగుతోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై దాదాపు రెండు నెలలు కావొస్తున్నా 10 వేల కౌలు రైతు కార్డులకు గాను ఇప్పటివరకు 4945 కార్డులే పంపిణీ చేశారు. అంటే దాదాపు 50 శాతమే పంపిణీ జరిగింది. మిగతా 50 శాతం పంపిణీ ఎప్పుడు జరుగుతుందోనని కౌలు రైతులు ఎదురు చూస్తున్నారు. మరోవైపు ఈ ప్రభుత్వంలో పాలసీలు మారితే తమకు రుణాలు వస్తాయో లేదోనన్న ఆందోళన వారిని మరింత కుంగదీస్తోంది. ప్రస్తుత పంటలసాగుకు బయట వ్యక్తుల నుంచి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకుని పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి నెలకొంటోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా ...


జిల్లావ్యాప్తంగా కౌలు రైతుల కార్డుల పంపిణీ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. రెవెన్యూ, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి రైతులను గుర్తించి కార్డులు ఇవ్వాలి ఉంది. వీటి ద్వారా కౌలు రైతులు బ్యాంకు రుణాలను పొందే అవకాశం ఉంటుంది. వైఎస్సార్ కడపజిల్లాలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో 7035 కౌలు కార్డులు మంజూరు లక్ష్యంగా ఉండగా గత ప్రభుత్వంలో లక్ష్యానికి మంచి 8126 కార్డులు మంజూరు చేసి అందించింది. కానీ ఈ ఏడాది ఆ హడావుడేమి కనిపించడం లేదని పలువురు కౌలు రైతులు అంటున్నారు. జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి 10 వేల కౌలు కార్డులు మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ 24వ తేదీ బుధవారం నాటికి జిల్లాలోని 36 మండలాల పరిధిలో 4945 కార్డులను మాత్రమే పంపిణీ చేశారు. మిగతా అందరికీ కార్డులు అందే సరికి ఖరీఫ్ సీజన్ దాటిపోయేలా ఉందని పలువురు కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులందరూ ఇప్పటికే వేరుశనగ, పత్తి, వరి, మినుము పంటలను అత్యధిక విస్తీర్ణంలో సాగు చేశారు. ప్రభుత్వం మారడంతో పాలసీ కూడా మారి తమకు బ్యాంకర్లు రుణాలు ఇస్తారో లేదోన్న సందేహం కౌలు రైతుల్లో నెలకొంది. కౌలు రైతులకు సబ్సిడీ విత్తనాలు, బ్యాంకు రుణాలు, పంటనష్టపరిహారం వంటి ఉత్పత్తి విక్రయాలను నిర్వహించుకోవాలంటే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉండాలి.

సకాలంలో కార్డులను మంజూరు చేయాలి



ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలన్నర దాటుతున్నా ఇంత వరకు సగం మందికి కౌలు కార్డులు మంజూరు చేయలేదు. మూడు రోజుల క్రితం జరిగిన క్యాబినేట్ సమావేశంలో కూడా రైతు సమస్యలపై చర్చించనే లేదు. కార్డులను సకాలంలో ఇవ్వకపోతే అన్నదాత సుఖీభవ, పంట రుణాల పెట్టుబడి, పంటలబీమా, సబ్సిడీ విత్తనాలు అందే పరిస్థితి ఉండదు. ప్రభుత్వం స్పందించి కౌలు కార్డులను మంజూరు చేయాలి. – బి. దస్తగిరిరెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి.

పర్యవేక్షిస్తున్నాం



కౌలు రైతుల కార్డుల పంపిణీకి సంబంధించి వీఆర్‌ఓలు, వ్యవసాయ అధికారులతో నిత్యం పర్యవేక్షిస్తున్నాం. ఈ ఏడాది 10 వేల కార్డుల లక్ష్యానికి గాను ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 4945 మంది కౌలు రైతులకు కార్డులను పంపిణీ చేశాం. మిగతా కౌలు రైతులకు కూడా వీలైనంత త్వరగా కార్డులు పంపిణీ చేసేందుకు కృషి చేస్తాం. – అయితా నాగేశ్వరావు, జిల్లా వ్యవసాయ అధికారి

క్లుప్తంగా

లే అవుట్ యజమానులకు తాఖీదులు



లే అవుట్ వద్ద తాఖీదులు అతికిస్తున్న సిబ్బంది

పోరుమామిళ్ల : మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలో అనుమతి లేకుండా లే అవుట్ వేసిన యజమానులకు తాఖీదులు జారీ చేసినట్లు మండల పంచాయతీ విస్తరణాధికారి రాజీవ్‌రెడ్డి తెలిపారు. పంచాయతీ పరిధిలోని వంద ఎకరాల స్థలంలో 14 లే అవుట్లు వెలిశాయని ఆయన తెలిపారు. కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అనుమతి లేకుండా వేయడంతో కొందరికి స్వయంగా, మరింత మందికి వాట్సాప్, ఇతర మార్గాల్లో తాఖీదులు ఇచ్చామని తెలిపారు. ఆ లేఅవుట్‌లో ఎలాంటి క్రయ, విక్రయాలు జరిగినా చర్యలు తీసుకుంటామన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలతో రైతులకు నష్టం



ఏఎస్పీకి వినతి పత్రం ఇస్తున్న ఎస్ఈ రమణ

కడప కార్పొరేషన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో జరుగుతున్న ట్రాన్స్‌ఫార్మర్ చోరీలను అరికట్టాలని విద్యుత్తు శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.రమణ కోరారు. ఏఎస్పీ లోసారి సుధాకర్‌ను బుధవారం కలిసి ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలపై ఫిర్యాదు చేశారు. రమణ మాట్లాడుతూ చాలా ప్రాంతాల్లో విద్యుత్తు శాఖకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి, అందులో కాపర్ వైరు చోరీ చేస్తున్నారన్నారు. దీంతో రైతులు సాగు చేస్తున్న పంటలకు, విద్యుత్తు శాఖకు తీరని నష్టం వాటిల్లుతోందని తెలిపారు. పోలీసులు నిఘా పెంచి చోరీలను అరికట్టాలని కోరారు.

ఏడీఏకు గాయాలు

లింగాల : మండలంలోని వెలిగండ్ల వద్ద జరిగిన ప్రమాదంలో ఏడీఏకు గాయాలయ్యాయి. వెలిగండ్లలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేసేందుకు వెళ్లిన ఆయన ద్విచక్ర వాహనంలో తిరిగి వస్తుండగా ఓ మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆయనకు, వాహనాన్ని నడుపుతున్న భాషాకు గాయాలయ్యాయి. పులివెందులలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

పోషకాహారం... వ్యాధులు దూరం

అసలే వర్షాకాలం.. అంట వ్యాధులు, అనారోగ్య సమస్యలు చుట్టుముట్టే కాలం. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా.. మలేరియా, డయేరియా ఇతర వ్యాధులు వెంటాడతాయి. అపరిశుభ్రమైన అలవాట్లు, నీరు, కలుషిత ఆహారమే ఇందుకు కారణం. ప్రతి ఒక్కరూ రోగ నిరోధక శక్తి పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. పోషకాహారం తీసుకుంటూ.. ఇతర రెడీమేడ్ ఆహారానికి దూరంగా ఉండాల్సిందే మరి..

కడప కోటిరెడ్డిసర్కిల్ : అతి ప్రేమ. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు తింటాములే అన్న నిర్లక్ష్యం.. ఆరోగ్యంగా ఉండాలన్న ఆరాటం. ప్రతి ఒక్కరిలో కనిపించేవే. అవి సహజం కూడా. కానీ... మోతాదు మించటం వల్లే సమస్యలన్నీ. ఏది కనిపిస్తే అది తినాలనుకోవటం ఇటీవల శ్రుతి మించుతోంది. ఫలితంగా.. వయసుకి మించి బరువు పెరుగుతున్నారు. ఇదే అనేక అనారోగ్య సమస్యలకు కారణమవుతోంది. దీనికి తోడు వ్యక్తిగత పరిశుభ్రత పాటించక పోవడం, సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం, వ్యాయమానికి దూరంగా ఉండడంతో ఎక్కువ మంది వ్యాధులను కొనితెచ్చుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో పరిసరాల పరిశుభ్రత పాటిస్తూనే.. పౌష్టికాహారం ఆవశ్యకతను ప్రజలకు వైద్యాధికారులు వివరిస్తున్నారు. నిల్వచేసిన ఆహారం, తీపి పదార్థాలకు దూరంగా ఉండడం మంచిదని చెబుతున్నారు. రెడీమేడ్ ఆహారం, ఫ్రిజ్‌లో నిల్వ ఉన్న కూల్ డ్రింకులు, ఆహార పదార్థాలు తీసుకోకపోవడం ఉత్తమమని హెచ్చరిస్తున్నారు.

రోజు వారీ ఆహారం ఇలా..

ప్రతి రోజూ రెండు ఇడ్లీలు లేదా 60 గ్రాముల గింజ ధాన్యాలు, 25 గ్రాముల పప్పుధాన్యాలు, 15 మిల్లీ లీటర్ల పాలు తీసుకోవచ్చు. అలాగే 11 గంటల సమయంలో ఏదో ఒక పండు, నిమ్మరసం లేదా జామ కాయ తీసుకుంటే మంచిది. ఇవేవీ అందుబాటులో లేకపోతే ఒక గ్లాసు పాలైనా తాగాలి. మధ్యాహ్న భోజనంలో 75 గ్రాముల గింజ ధాన్యాలతో చిరుతిండి, కప్పు పాలు తాగాలి. రాత్రి భోజనంలో రెండు కప్పుల అన్నం లేదా చపాతి లేదా



తాజా కూరగాయలు

పుల్కా, కూరగాయలతో కూడిన కూర తీసుకోవాలి. ప్రతిరోజూ 150 మిల్లీ లీటర్ల పాలు తీసుకోవాలి. టీ, కాఫీ కావాల్సిన వారు రోజుకు ఒకటి లేదా రెండు సార్లు మాత్రమే తీసుకుంటే మంచిది.

పప్పుధాన్యాలు

ఆహారంలో పప్పులు, మినుములు, శనగలు, బాదంపప్పు వంటివి ఏదో ఒకటి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతిరోజూ ఏదో ఆకు కూర వంద గ్రాములు ఉండేలా చూసుకోవాలి. జామ, ఉసిరి, నిమ్మ వీటిలో ఏదో ఒకటి తప్పనిసరిగా తీసుకోవాలి. అలాగే ఉడకబెట్టిన కోడిగుడ్డును రోజూ ఒకటి చొప్పున వారానికి ఒకసారి చికెన్ లేదా మటన్ తీసుకోవాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

జలుబు, దగ్గు, ఆయాసం వంటి సమస్యలు ఉన్న వారు ఉపశమనం కలగాలంటే మిరియాలు, అల్లం, వెల్లుల్లి బాగా ఉపయోగపడతాయి. వీటిని ఔషధం మేరకు వేడి పాలు, వేడి నీరు, టీలో కలుపుకొని తాగితే ఉపశమనం కలుగుతుంది.

ఆహారపు అలవాట్లు

ప్రతిపూట భోజనానికి ముందు, తర్వాత సబ్బుతో చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. పరిశుభ్రమైన ఆహారం తీసుకుంటే వ్యాధులు దరి చేరవు. ఆహారాన్ని ఒకేసారి కాకుండా కొద్దికొద్దిగా ప్రతి మూడు గంటలకోసారి తీసుకోవడం ఉత్తమం. రోజూ తినే ఆహారంలో తాజా ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు ఉండేలా చూసుకోవాలి. పసుపు, నారింజ రంగులో ఉండే పండ్లు దీర్ఘకాలిక వ్యాధులను నయం చేస్తాయి. తాజాగా ఉండే పచ్చికూరగాయలు, పండ్లను జ్యూస్ రూపంలో కూడా తీసుకోవచ్చు.

మంచి ఆహారంతోనే ఆరోగ్యం

ఆహారంలో పల్లీలు, మినుములు, శనగలు, బాదం, పప్పు ధాన్యాలు వంటి ఏదో ఒకటి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే బాగా ఉడికించిన ఆహారం తీసుకుంటే మంచిది. విటమిన్లు ఉన్న ఆహారం తీసుకుంటే ఆరోగ్యవంతంగా ఉంటాం. అలాగే పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంచుకుంటే మంచిది.

– డాక్టర్ అక్షిత చంద్రశేఖర్‌రెడ్డి, వైద్య నిపుణులు, కడప

59 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రధాన స్మగ్లర్, ముగ్గురు ప్రొటెక్షన్ వాచర్లు అరెస్టు

బద్వేలు అర్బన్ : అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం దుంగలను అటవీ సిబ్బంది బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఒక స్మగ్లర్‌తోపాటు, వారికి సహకరించిన ముగ్గురు ప్రొటెక్షన్ వాచర్లను అరెస్టు చేశారు. మైదుకూరు డీఎస్పీ టి.వెంకటేశులు వివరాలు వెల్లడించారు. వైఎస్సార్ కడప జిల్లా సరిహద్దున పి.పి.కుంట సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి ఎర్రచందనం దుంగలు రవాణా చేసేందుకు సిద్ధంగా ఉంచారని అటవీ అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు రూరల్ సీఐ బీవీ. విక్రమసింహ, ఎస్ఐ జె.రవికుమార్, సిబ్బంది దాడులు నిర్వహించారు. రేగిమానుకుంట ప్రాంతంలో కొందరు వ్యక్తులు దుంగలు వాహనంలోకి లోడ్ చేస్తూ కనిపించారు. నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం చుంచులూరుకు చెందిన షేక్ రసూల్, మర్రిపాడు మండలం అనంతపురానికి చెందిన పాలెం పెంచలప్రసాద్, మర్రిపాడు మండలం తిమ్మనాయుడుపేటకు చెందిన ఆవులపోలు చిన్నయ్య, నెల్లూరు జిల్లా వింజమూరు మండలం యర్రబల్లిపాలెంకు చెందిన పేరుమోసిన స్మగ్లర్ గుద్దేటిరామనాథరెడ్డి



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న మైదుకూరు డీఎస్పీ వెంకటేశులు

అలియాస్ వింజమూరు రామనాథరెడ్డిలను పట్టుకున్నారు. వారి నుంచి 59 ఎర్రచందనం దుంగలతోపాటు, ఓ మినీ లారీ, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న 1426 కిలోల దుంగల విలువ సుమారు రూ.14.26 లక్షలు ఉంటుంది. పట్టుబడిన వారిలో రసూల్, పెంచలప్రసాద్, చిన్నయ్య నెల్లూరు జిల్లా ఆత్మకూరు రేంజ్‌లోని కదిరినాయుడుపల్లె బీట్‌లో ప్రొటెక్షన్ వాచర్లుగా పనిచేస్తున్నారు. అక్రమ రవాణాకు ప్రోత్సహించిన, పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో అట్లూరు ఎస్ఐ కె.సి.రాజు, రూరల్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

చెట్టుకు ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



ఉరి వేసుకున్న చంద్ర శేఖర్

పోరుమామిళ్ల : మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలో ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందివ్వడంతో ఎస్ఐ తిమోతి కేసు నమోదు చేశారు. ఎస్ఐ వివరాల మేరకు.. కర్నూలు జిల్లా ఆత్మకూరుకు చెందిన పెద్దిచంద్రశేఖర్ పోరుమామిళ్ల పరిధిలోని బలిజకోటలో పందుల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. స్థానిక యువతి సరస్వతిని వివాహం చేసుకున్నాడు. వీరికి ముగ్గురు పిల్లల సంతానం. ఇటీవల మద్యానికి బానిసైన చంద్రశేఖర్ సంపాదనంతా.. విచ్చలవిడిగా ఖర్చు చేస్తుండటంతో అతడి భార్య సరస్వతితో విభేదాలు తలెత్తాయి. గత రెండేళ్లుగా ఇంటికి దూరంగా ఉంటూ ఆత్మకూరులో బేల్దారి పనులు చేసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం రంగసముద్రం సమీపంలో చెట్టుకు వేలాడుతూ విగతజీవిగా కనిపించారు. స్థానికులు పోలీసులకు తెలుపడంతో ఎస్ఐ పరిశీలించి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు.

బడ్జెట్‌తో సీమకు ఒరిగిందేమీ లేదు

– సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈశ్వరయ్య

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్ర బడ్జెట్‌తో రాయలసీమకు ఒరిగిందేమీ లేదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈశ్వరయ్య అన్నారు. స్థానిక మీడియాతో ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో విభజన చట్టంలోని హామీల జాడే లేదని, కడప ఉక్కు కర్మాగారం ఇక జ్ఞాపకంగా ఉండి పోవాల్సిందేనన్నారు. హంద్రీనీవా, గాలేరు–నగరి, తెలుగుగంగ, వెలిగొండ ప్రాజెక్టులకు నిధులు కేటాయింపు లేదన్నారు. హైదరాబాద్ –బెంగళూరు పారిశ్రామిక కారిడార్ ఎప్పుడు వస్తుందో.. దాంతో కర్నూలు, అనంతపురానికి ఎప్పుడు లబ్ధి కలుగుతుందోనని ఎద్దేవా చేశారు. చంద్రబాబు దృష్టిలో రాష్ట్రం అంటే కొన్ని జిల్లాలు మాత్రమేనని, పట్టిసీమ ద్వారా రాయలసీమకు అదనపు జలాలు కేటాయిస్తూ ఎందుకు జీవో ఇవ్వకూడదో చెప్పాలని ప్రశ్నించారు. ఉక్కు కర్మాగారం కోసం కడపలో అనకాపల్లి బీజేపీ ఎంపీ సీఎం రమేష్ ఆమరణ నిరాహార దీక్ష చేసిన సంగతి మరిచారా? అని ప్రశ్నించారు.

కేసీ కెనాల్‌లో పడి వ్యక్తి మృతి

కడప అర్బన్ : కడప నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్మాస్‌పేట యానాది కాలనీకి చెందిన యాకసిరి నరసయ్య (51) ఈ నెల 22న మధ్యాహ్నం ఇంటి నుంచి వచ్చి కేసీ కెనాల్‌లో ప్రమాదవశాత్తు పడి మరణించాడు. అతని భార్య యాకసిరి అంకమ్మ ఫిర్యాదు మేరకు తన భర్తకు మూర్ఛ వచ్చేదని, సోమవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదని అన్నారు. బుధవారం పోలీసుల సమాచారంతో తన భర్త కేసీ కెనాల్‌లో పడి మృతి చెందినట్లు తెలిసిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంజీవరాయుడు తెలియజేశారు.

శిక్షణతో నైపుణ్యాభివృద్ధి

సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకులు కల్పనాశైల

కడప ఎడ్యుకేషన్ : రిసోర్స్ పర్సన్లు(ఐఈఆర్పీ) డిజిటల్, టీచింగ్, లెర్నింగ్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకులు కల్పనా శైల పిలుపునిచ్చారు. కడప డీఈఓ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖాధికారి మర్రెడ్డి అనురాధ ఆధ్వర్యంలో రిసోర్స్ పర్సన్ల జిల్లా స్థాయి సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా కల్పనా శైల మాట్లాడుతూ భవిత సెంటర్లను సందర్శించి వాటిలో లోటుపాట్లను ఐఈఆర్పీలకు వివరించారు. జిల్లా విద్యాశాఖ అధికారిణి మర్రెడ్డి అనురాధ, డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఏ దివ్యాంగ విద్యార్థి ఆన్‌లైన్ నమోదుకు దూరంగా ఉండకూడదన్నారు. సమీప పాఠశాలలు, భవిత సెంటర్లలో దివ్యాంగులను చేర్చి వారికి సకాలంలో భత్యం



ఐఈఆర్పీల సమావేశంలో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకులు కల్పనాశైల

అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా సహిత విద్య సమన్వయకర్త మెట్టకేశవరెడ్డి, సహాయ సమన్వయకర్త రమణమూర్తి మాట్లాడుతూ నిర్లక్ష్యం చేయకుండా వందశాతం దివ్యాంగ పిల్లలను పాఠశాలలో చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రాల రిసోర్స్ పర్సన్లు, తదితరులు పాల్గొన్నారు.

మల్టీడేస్ క్రికెట్ పోటీలు ప్రారంభం



127 పరుగులు చేసిన శ్రీకాకుళం బ్యాట్స్‌మన్ సుశాంత్



5 వికెట్లు తీసిన శ్రీకాకుళం బౌలర్ పూర్ణ



5 వికెట్లు తీసిన విశాఖ బౌలర్ దేవాశిష్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానం, కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రికెట్ మైదానలు వేదికగా ఏసీఏ అండర్–19 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప, పశ్చిమగోదావరి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 79.3 ఓవర్లలో 215 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పశ్చిమగోదావరి జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి 19 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 28 పరుగులు చేసింది.

కేఓఆర్ఎం మైదానంలో..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో నెల్లూరు, శ్రీకాకుళం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నెల్లూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 29.3 ఓవర్లకే 119 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. శ్రీకాకుళం బౌలర్ పూర్ణ 5 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 59 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 262 పరుగులు చేసింది. జట్టులోని ఎస్. సుశాంత్ 80 బంతుల్లో 127 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసే సమయానికి శ్రీకాకుళం జట్టు 143 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

కేఎస్ఆర్ఎం మైదానంలో..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో విశాఖపట్నం, చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుని తొలిరోజు ఆట ముగిసే సమయానికి 88.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 286 పరుగులు చేసింది. జట్టులోని వరుణ్ 79 పరుగులు చేశాడు. విశాఖ బౌలర్లు దేవాశిష్ 5 వికెట్లు తీశారు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

నిర్మాణ రంగంలో డ్రోన్లకు పెరిగిన ప్రాధాన్యం

కడప కల్చరల్ : ప్రభుత్వ, ప్రైవేటు భవన నిర్మాణాలు, ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణ రంగంలో డ్రోన్ల ప్రాధాన్యం పెరిగిందని హైదరాబాద్ డ్రోనిక ఇన్నోవేషన్ ట్రైనర్ గుట్లపల్లి అశోక్‌కుమార్ అన్నారు. కడప సీపీ బ్రౌన్ బాషా పరిశోధన కేంద్రంలో డ్రోన్ ఉపయోగం, మార్కెటింగ్ అంశాలపై బుధవారం అవగాహన కల్పించారు. ట్రైనర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ డ్రోన్ల సర్వే ప్రణాళికాబద్ధంగా ఉంటుందన్నారు. అనంతరం సర్వే చేసే విధానాన్ని ఆయన వివరించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పద్మప్రియ చంద్రారెడ్డి సంస్థ సభ్యుల సంక్షేమం



చెక్కును అందజేస్తున్న పద్మప్రియ చంద్రారెడ్డి

కోసం రూ.50 వేల చెక్కును ప్రతినిధులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శంకర్‌రెడ్డి, కార్యదర్శి శివరామకృష్ణ, కోశాధికారి వీరబ్రహ్మం, ఉపాధ్యక్షుడు జిలానీబాషా, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద ఘటనపై పారదర్శక విచారణ

- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు
- ఇద్దరు ఆర్డీఓలు, 35 మంది రెవెన్యూ అధికారుల విచారణ

మదనపల్లె : సబ్ కలెక్టరేట్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో ప్రభుత్వ ఉద్యోగులు, కొందరు వ్యక్తుల ప్రమేయం ఉండటంపై విచారణ చేస్తున్నామని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అన్నారు. మదనపల్లె సబ్ కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో మీడియాతో ఆయన మాట్లాడుతూ...రోజూ ఆర్డీఓ హరిప్రసాద్, గతంలో ఆర్డీఓగా పనిచేసిన ఎం.ఎస్.మురళీలతోపాటు, మరో 35 మంది సబ్ కలెక్టరేట్ సిబ్బందిని విచారిస్తున్నట్లు తెలిపారు. ప్రమాద ఘటన తెలిసిన వెంటనే డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ శ్యాంపిళ్ల సేకరణ చేశామన్నారు. కాల్చేందుకు ఉపయోగించిన మెటీరియల్ను పకడ్బందీగా భద్రపరిచామన్నారు. సుమారు 700 ఫైళ్లను గుర్తించి, సెక్షన్ల వారీగా విభజించాల్సిందిగా అధికారులకు అందించామన్నారు. విద్యుత్తు సరఫరాపై ఆ శాఖ అధికారులు నివేదిక తయారుచేశారన్నారు. సీడీఆర్ అనాలసిస్, టవర్ లొకేషన్ నుంచి సేకరించిన డేటా, 21 కెమెరాల నుంచి తీసుకున్న సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు.

అమాయకుడిని బలి చేస్తున్నారు

మదనపల్లె: ఉన్నత చదువులు అభ్యసించి.. ఉద్యోగం చేస్తున్న వ్యక్తిని బలిపశువు చేస్తున్నారని సబ్ కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ్ కుటుంబ సభ్యులు బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. సబ్ కలెక్టరేట్ వద్దకు చేరుకున్న గౌతమ్‌తేజ్ సోదరుడు గోరంట్ల ప్రభు మాట్లాడుతూ అగ్ని ప్రమాదం ఘటనకు తమ కుటుంబసభ్యుడిని బాధ్యుడిగా పేర్కొంటూ ప్రచారం చేయడాన్ని ఆక్షేపించారు. గౌతమ్‌తేజ్ తండ్రి వరదరాజులు చనిపోవడంతో కారుణ్య నియామకం కింద ప్రభుత్వ ఉద్యోగంలో చేరాడన్నారు. చిత్తూరు కలెక్టరేట్‌లో పనిచేస్తున్న గౌతమ్‌తేజ్‌ను కమ్మ కులానికి చెందిన వాడనే సాకుతో అక్కడి నుంచి వి.కోటకు బదిలీచేశారన్నారు. మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తూ ఆదివారం వ్యక్తిగత పనులపై చిత్తూరుకు వెళ్లిన తేజ్‌కు ఆర్డీఓ హరిప్రసాద్ ఫోన్‌చేశారన్నారు. రిలీవ్ అవుతున్నందున పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేసేందుకు రావాలని ఆదేశించారన్నారు. సోమవారం జరిగిన ఘటనకు గౌతమ్ తేజ్‌ను బాధ్యుడిని చేస్తూ వార్తలు రావడం తగదన్నారు. పోలీసులు పారదర్శకంగా విచారించి అసలు దోషులను బయటపెట్టాలన్నారు.

వీఆర్‌కు వన్‌టౌన్ సీఐ వలీబాషు

మదనపల్లె : మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాద ఘటన విషయంలో అలసత్వం ప్రదర్శించినందుకు వన్‌టౌన్ సీఐ వలీబాషును వీఆర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాలు జారీ చేశారు. ఇదే ఘటనకు సంబంధించి వన్‌టౌన్ కానిస్టేబుళ్లు హరిప్రసాద్, భాస్కర్‌లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

ఆక్రమిత స్థలంపై ఆర్డీవో విచారణ



విజయనగరంలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

చాపాడు : మండలంలోని విజయనగరం గ్రామానికి చెందిన ముక్కమల్ల జెర్మియా స్థలం ఆక్రమణకు గురైందని కడప కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేయడంతో జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు బుధవారం విచారించారు. అల్లాడుపల్లె గ్రామ సర్వే నెంబర్ 214–బిలో జెర్మియా పేరుతో 12 సెంట్ల స్థలం ఉంది. ఆక్రమణకు గురైన స్థలం రికార్డులు పరిశీలించి ఇరువైపున ఉన్న రైతులతో మాట్లాడారు. ఫిర్యాదుదారు స్థలంలో అంగన్వాడీ భవనం నిర్మాణం జరిగినట్లు గుర్తించారు. ఇదే క్రమంలో రేషన్ బియ్యం పంపిణీ చేసే ఆటో ఇతరులకు అందించారని జెర్మియా ఫిర్యాదు చేయడంతో వినతిపత్రం ఇస్తే తిరిగి ఇప్పిస్తామని ఆర్డీఓ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఉమారాణి, ప్రవీణ్, సాయిలత, ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.

పుష్పగిరిలో పురావస్తు అధికారుల పర్యటన



పుష్పగిరిలో పనుల వివరాలు తెలుసుకుంటున్న పురావస్తు శాఖ అధికారులు

వల్లూరు : ప్రముఖ పుణ్యక్షేత్రం పుష్పగిరిని కేంద్ర పురావస్తు శాఖ అధికారులు బుధవారం సందర్శించారు. ఆ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఇంజినీర్ భాను ప్రకాష్ వర్మ, కడప జిల్లా సీఏ బాలక్రిష్ణారెడ్డి, సర్వేయర్ ఫణీంద్ర, తదితరులు కొండపై లక్ష్మీచెన్నకేశవ స్వామిని దర్శించుకున్నారు. సంతాన మల్లేశ్వర స్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ గోపురం, ఇతర నిర్మాణాలను వారు పరిశీలించారు. మరమ్మతులు చేపట్టడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వారు పేర్కొన్నారు. అనంతరం చెన్నూరు కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పురావస్తు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


ముప్పై ఏళ్లనాటి చెట్టు నరికివేత



చెట్టును నరికివేసి రోడ్డుపై పడేసిన దృశ్యాలు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ జిల్లా కడప నగరం 50వ డివిజన్ పరిధిలోని సాయిపేటలో ముప్పై ఏళ్ల నాటి చెట్టును టీడీపీ నాయకులు నరికి వేశారు. అన్నదమ్ముల వివాదంలోకి చొరబడిన అధికార పార్టీ నాయకులు చెట్టును నరికి రోడ్డుపై పడేశారు. వివరాలిలా ఉన్నాయి. పాలెంపల్లిలో సిమెంటు రోడ్డుకు ఎడమ వైపున మేకల సాంబశివ అనే వ్యక్తి ఇంటి ముందు ప్రభుత్వ బంజరు భూమిలో 30 ఏళ్ల నుంచి తుమ్మ చెట్టు ఉంది. ఈ చెట్టును కొట్టివేయాలని సాంబశివ సోదరుడు మేకల శేఖర్ ప్రయత్నించగా గతంలో అడ్డుకొని అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో అతడు స్థానిక టీడీపీ నేతల సహకారంతో దౌర్జన్యంగా చెట్టును నరికివేయించాడు. తనను ఎత్తుకుపోయి గదిలో వేశారని, దీనిపై 100కు ఎన్నిసార్లు డయల్ చేసినా పోలీసులు స్పందించలేదని సాంబశివ అన్నాడు. కార్పొరేషన్, రెవెన్యూవారికి ఫోన్ చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

టీడీపీ ప్రొద్దుటూరు ఇన్‌చార్జి ప్రవీణ్ ఇంటి వద్ద ఉద్రిక్తత



అసిస్టెంట్ సిటీ ప్లానర్ మునిరత్నంతో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి వాగ్వాదం

ప్రొద్దుటూరు : వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులోని వైఎంఆర్ కాలనీలోని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జీవీ ప్రవీణ్ కుమార్‌రెడ్డి ఇంటి వద్ద మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ మునిరత్నం ప్రవీణ్ ఇంటికి సంబంధించిన ర్యాంప్‌ను తొలగించేందుకు జేసీబీని తీసుకెళ్లారు. దీంతో ప్రవీణ్‌తో పాటు ఆయన తండ్రి ప్రతాప్‌రెడ్డి అడ్డుకున్నారు. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ర్యాంప్‌లను తొలగించాక తమ ఇంటి వద్దకు రావాలని, ఏ నోటీసు లేకుండా ఎలా వచ్చారని ప్రశ్నించారు. ముందస్తుగా జేసీబీతో పాటు త్రీటౌన్ ఏఎస్ఐ సుబ్బన్న, సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి తిరిగి వచ్చారు. కాగా అధికార పార్టీలోని ముఖ్య నేత ఆదేశించడంతోనే మున్సిపల్ అధికారులు ప్రవీణ్ ఇంటి వద్ద ర్యాంప్ తొలగించేందుకు వెళ్లారని సమాచారం.

ఏడు గడ్డివాములు దగ్ధం

రాజుపాళెం : మండలంలోని కొర్రపాడు గ్రామంలో బుధవారం తెల్లవారు జామున నలుగురు రైతులకు చెందిన ఏడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివామికి నిప్పుపెట్టడంతో ఉన్నపాటుగా మంటలు ఎగసిపడ్డాయి. అక్కడే కొళాయిలకు వస్తున్న నీటిని పట్టి స్థానికులకు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికీ అదుపు కాకపోవడంతో అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చి మంటలు అదుపు చేసే సరికి మొత్తం పశుగ్రాసం కాలిపోయింది. సంఘటన స్థలాన్ని ప్రొద్దుటూరు రూరల్ సీఐ రమణారెడ్డి, ఎస్ఐ తులసీ నాగప్రసాద్, మండల ఇన్‌చార్జి ఆర్ఐ అశోక్, వైఎస్సార్‌సీపీ నాయకుడు దొంతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి వచ్చి పరిశీలించారు.